సాక్షి ఒడిశా

బుధవారం। 16। ఏప్రిల్। 2025



కాంగ్రెస్‌లో చేరికలు..

రాయగడలో కాంగ్రెస్‌లో పలువురు చేరారు. వారిని సాదరంగా ఆహ్వానించారు.

- 8లో

రసవత్తరం..

కొరాపుట్ బీజేడీ అధ్యక్షుడి నియామకం రసవత్తరంగా మారింది. ముగ్గురు ఆశావహులు ఉన్నారు.



- 8లో



ముగిసిన ఉత్సవాలు

శ్రీరామ నవమి ఉత్సవాలు ముగిశాయి. జయపురంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

- 8లో

బిజూ విగ్రహ దగ్ధంపై.. మండిపాటు



హైస్కూల్ కూడలి వద్ద బీజేడీ శ్రేణుల ఆందోళన

కొరాపుట్: ఉత్కళ వర పుత్రుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ విగ్రహం కాల్చివేతపై బీజేడీ శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం బలంగీర్ జిల్లా పాట్నఘడ్ పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు బిజూ విగ్రహాన్ని దగ్ధం చేశారు. ఈ ప్రాంతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేవీ సింగ్ దేవ్ సొంత నియోజకవర్గం కావడంతో సాయంత్రం కొరాపుట్ జిల్లా కేంద్రంలో బీజేడి శ్రేణులు బిజూ పట్నాయక్ విగ్రహం వద్ద నివాళులర్పించాయి. అనంతరం ర్యాలీ చేశారు. ఆందోళనలో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహీ, కొరాపుట్ జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక, మున్సిపల్ చైర్మన్లు లలెటెందు ర ంజన్ శెఠి, రాజేంద్ర కుమార్ పాత్రోలు,మాజీ మంత్రి ర బినారాయణ నందో పాల్గొన్నారు.

నబరంగ్‌పూర్ జిల్లాలో..

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో బీజేడి శ్రేణులు ఆందోళన చేశాయి. చమిరియాగుడలో బిజూ విగ్రహానికి నివాళులర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని, బీజేడీ నాయకులు తపస్ త్రిపాఠి పాల్గొన్నారు. బిజూ స్వాతంత్ర్య సమరయోధుడన్న విషయం గుర్తుంచుకోవాలని జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహీణీపతి అన్నారు.

బిజూ విగ్రహం కాల్చివేతపై మండిపాటు

పర్లాకిమిడి: ఒడిశాలో బొలంఘీర్ జిల్లా పట్నాఘడ్‌లో మాజీ ముఖ్యమంత్రి దివంగత బిజూ పట్నాయిక్ విగ్రహానికి కొందరు నిప్పు పెట్టారు. ఈ ఘటనపై గజపతి జిల్లా బిజేడీ పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక హైస్కూల్ జంక్షన్ బిజూ పట్నాయిక్ విగ్రహం వద్ద బీజేడీ పార్టీ శ్రేణులు మంగళవారం సాయంత్రం ప్లకార్డులు పట్టుకుని నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ, కటక్‌లో ఇటీవల బిజూ పట్నాయిక్ విగ్రహం తలను పడగొట్టారని, అలాగే పట్నాఘడ్‌లో విగ్రహానికి నిప్పు పెట్టడం అత్యంత హేయమని అన్నారు. ఆయనతో పాటు బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, గుసాని సమితి చైర్మన్ ఎన్.వీర్రాజు, యువజన అధ్యక్షులు శాసనం లింగరాజు, ఎస్.గజపతి రావు, బీజేడీ ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత పోరిచ్చా తదితరులు మాట్లాడారు.



నబరంగ్‌పూర్‌లో బిజూ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రదీప్ మజ్జి, సదాశివ ప్రదాని



పాట్నఘడ్‌లో దగ్ధమవుతున్న బిజూ పట్నాయిక్ విగ్రహం



హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయిక్ విగ్రహం వద్ద బీజేడీ శ్రేణుల నిరసన



కొరాపుట్‌లో ఆందోళన చేస్తున్న బీజేడీ శ్రేణులు



కొరాపుట్‌లో వినతి పత్రం అందజేస్తున్న బీజేడీ నాయకులు



కొరాపుట్‌లో బిజూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈశ్వర్ పాణీగ్రాహీ, రబినందో



హైస్కూల్ జంక్షన్ వద్ద ప్లకార్డులతో బీజేడీ శ్రేణుల నిరసన

న్యూస్‌రీల్

హామీలు అమలు చేయాలి



ఆందోళన చేపడుతున్న సీపీఐ నాయకులు

కొరాపుట్: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జయపూర్ పట్టణంలో జాతీయ రహదారి–26పై సోమవారం నిరసన తెలిపారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 300 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇవ్వలేమని చేతులెత్తేయడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్ ధరలు పెంచడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన జుధిష్ఠ రౌవులో, ప్రమేద్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో..బైక్ ఢీ: నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో క్షతగాత్రులు

రాయగడ: ఆటో బైకు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి బుడాగుడ కూడలిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనలో నాగేశ్వర కంజిక, ఇలాయి కద్రక,చందు కద్రక, త్రినాథ కద్రకలు గాయపడ్డారు. సోమవారం ఒకే బైకు పై వీరంతా కొరపా పంచాయతీలోని బలిపాడొరి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఒక ఆటోను అదుపు తప్పి ఢీకొన్నారు. ఈ ఘటనలో బైకు పై ప్రయాణించే వారంతా గాయాలపాలయ్యారు. స్థానికులు స్పందించి సమీప ఆస్పత్రికి తరలించారు.

భారీగా హిందూ ఏక్తా వాహిని ర్యాలీ



మున్సిపాలిటీ కార్యాలయం వద్ద హనుమాన్ సైకత శిల్పం

కొరాపుట్: హిందూ ఏక్తా వాహిని వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించింది. సోమవారం రాత్రి నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఈ బల ప్రదర్శన జరిగింది. ఏటా ఒడియా నూతన సంవత్సరం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహిస్తారు. ఆంధ్ర ప్రదేశ్,ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా కళాకారులు ర్యాలీలో పాల్గొన్నారు. పలు చోట్ల ముస్లిం సంస్థల ప్రతి నిధులు హిందువులకు మిఠాయి తినిపించారు. బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ర్యాలీలో పాల్గొన్నారు.

బీజేడీ శ్రేణుల నిరసన



కపిలాస్ కూడలిలో ఆందోళన చేపడుతున్న బీజేడీ శ్రేణులు

రాయగడ: స్థానిక కపిలాస్ కూడలి వద్ద బీజేడీ శ్రేణులు సోమవారం నిరసన చేపట్టాయి. రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, బీజేడీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ.. ఒడిశా ప్రజలు దివంగత బిజూ పట్నాయక్‌ను వర పుత్రునిగా ఆరాధిస్తుండేవారు. కానీ బీజేపీ ప్రభుత్వం అటువంటి మహానాయకుడిని అవమానించడం సరికాదన్నారు.ఉప ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పాట్నాఘడ్‌లో బిజూ పట్నాయక్ విగ్రహాన్ని తగులబెట్టడం వంటి దుశ్చర్యకు పాల్పడడం దారుణమన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

29న కలెక్టర్ ద్వారా ప్రధానికి మెమొరాండం సమర్పణ



సమావేశంలో మహంతితో పాటు అసోసియేషన్ సభ్యులు

జయపురం: ప్రధాన మంత్రి పలు వాగ్దానాలు చేస్తూ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారని, అయితే ఆ వాగ్దానాలు అమలు చేయటం లేదని ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి విమర్శించారు. మంగళవారం స్థానిక యాదవ భవనంలో కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షన్ దారుల సమావేశంలో మహంతి అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ కాంత రథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి పెన్షన్లు పెంచుతామని, కనీస పెన్షన్ పెరుగుతాయని ఆశలు చూపారని అయితే ఆ వాగ్దానాలు అమలు చేయటం లేదని ఆరోపించారు. పార్లమెంట్‌లో మెజారిటీ గల ఆయన వామపక్షాల ఎంపీలతో ప్రధాన మంత్రి ఇచ్చిన వాగ్దానాలపై చర్చించేందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.213 కోట్లు జమ అయిందని దానికి వచ్చే వడ్డీలో కొంతైనా కార్మికులకు ఇస్తే నష్టం లేదని, అయినా ఇచ్చేందుకు ప్రభుత్వానికి మనసు రావడం లేదన్నారు. కార్మికులకు రూ.9వేలు పెన్షన్ డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈపీఎఫ్ పెన్షన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను మరోసారి ప్రధాన మంత్రికి తెలిపేందుకు ఈ నెల 29వ తేదీన జిల్లా కలెక్టర్ ద్వారా ప్రధాన మంత్రికి మెమొరాండం సమర్పించేందకు మహంతి ప్రతి పాదించగా అందుకు సమావేశం సమ్మతించింది. సమావేశంలో బసంత బెహర, ముధిరత్, దండపాణి పాత్రో, కేసీ పండా, రామ శంకర పట్నాయిక్, సర్వేశ్వర పండ, సుభాష్ బెహర, సరోజ్ పండ, జి.ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రాయగడ: రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ఆందోళన చేశారు. స్థానిక కాంగ్రెస్ భవనం నుంచి కొత్త బస్టాండ్ వరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత పూర్తిగా కరువయ్యిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సునీల్ చంద్ర పండ, అస్లామ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గజపతి జిల్లాకు ఎల్లో వార్నింగ్



పర్లాకిమిడి రాజవీధిలో పడుతున్న వర్షం

పర్లాకిమిడి: ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్ వరకూ ఏర్పడిన ఆవర్తనం నేపథ్యంలో గజపతి జిల్లాకు ఐఎండీ అధికారులు ఎల్లో వార్నింగ్ జారీ చేశారు. దీంతో మంగళవారం నుంచి పర్లాకిమిడి, కాశీనగర్, గుమ్మా, రామగిరి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు బుధవారం వరకూ కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత మల్కన్‌గిరి



విజేత మల్కన్‌గిరి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే మంగుఖీలో

మల్కన్‌గిరి: పట్టణంలోని స్టేడియంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీల్లో మల్కన్‌గిరి రాయల్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో మల్కన్‌గిరి రాయల్స్ జట్టు కోరుకొండ సాయి స్పోర్ట్స్ ఎలియన్స్‌ను చిత్తుచేసింది. చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే ప్రతినిధి నిహాల్ రోయి, ఎంపీ ప్రతినిధి సంజయ్ సర్కార్, డీఐపీఆర్వో ప్రమిళ మాఝి టీమ్ ఇండియా క్రికెట్ మేనేజర్ పప్పుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన



ధరల పెరుగుదలకు నిరసనగా ఆందోళన చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు

జయపురం: పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. 26 వ జాతీయ రహదారి జయపురం కూడలి వద్ద ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఆందోళన చేశాయి. జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్ఠర్ రౌళో మాట్లాడుతూ నేడు కేంద్రంలోను, రాష్ట్రంలోను డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని, వీరి వల్ల ప్రజలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఎన్నో హామీలు గుప్పించిందని, వాటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై అత్యాచారాలు, కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. నేటి నుంచి ప్రతి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త ఇంటిముందు హుండీలు ఏర్పాటు చేసి చందాలు వసూలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 25 వ తేదీన పట్టణంలో నిధి సంగ్రహ అభిజాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆందోళనలో రాష్ట్ర కమ్యూనిస్టు నేత ప్రమోద్ కుమార్ మహంతి, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, అజిత్ పట్నాయిక్,ప్రినాథ్ టంగా, దామోదర పంగి, లక్ష్మణ పంగి, సుకుమార్ పారజ, మనోహర హరిజన్ మొదలగు వారు పాల్గొన్నారు.

మందిరం కూల్చివేతపై ఉద్రిక్తత



స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగిస్తున్న ప్రజలు

కొరాపుట్: మందిరం కూల్చివేత ప్రయత్నాలపై ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మంగళవారం జయపూర్ పట్టణంలో గోపబంధు నగర్ ప్రాంతంలో నీలకంఠ సాగర్‌కి ఆనుకుని ఉన్న మా మంగళ మందిరం కూల్చివేయడానికి అధికారులు ప్రయత్నించారు. మందిర నిర్మాణం రోడ్డు మీదకి విస్తరించడంతో కూల్చడానికి మున్సిపల్ అధికారులు చేరుకున్నారు. వెనుకబడిన సున్నిత ప్రాంతం కావడంతో పెద్ద ఎత్తున మహిళలు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు స్థానికులతో చర్చలు జరిపారు.



తొలగింపునకు వచ్చిన జేసీబీలు



అధికారులను అడ్డుకుంటున్న స్థానిక మహిళలు

భక్తులపై తేనెటీగల దాడి



పరిస్థితి సమీక్షిస్తున్న అధికారులు

కొరాపుట్: తేనెటీగలపై కోతుల దాడి చేయడంతో అవి చెలరేగి భక్తులపై దాడి చేశాయి. మంగళవారం సాయంత్రం కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో భీర్‌కంభ అమ్మవారి దేవాలయంలో జాతర జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ఇక్కడకు సమీపంలో ఉన్న తేనె పట్టులపై కోతులు దాడి చేశాయి. దీంతో తేనె తుట్ట కదిలి తేనెటీగలన్నీ భక్తులపై దాడి చేశాయి. సుమారు 30 మందికి తీవ్ర గాయాలు కాగా.. వారిని బొయిపరిగుడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. దేవాలయ పూజారి కృష్ణ నాయక్, నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన అశ్విని పట్నాయక్ అనే బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ప్రకటించారు.



బొయిపరిగుడ ఆస్పత్రిలో క్షతగాత్రులు



విషమ పరిస్థితిలో నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన అశ్విని పట్నాయక్



అచేతన స్థితిలో పూజారి కృష్ణనాయక్

క్లుప్తంగా

నబరంగ్‌పూర్ బీజేడీ అధ్యక్షుడిగా మనోహర్


మనోహర్ రంధారి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారిని పార్టీ నియమించింది. మంగళవారం రాత్రి పార్టీ అధిష్టానం తొలి విడతగా 18 జిల్లాల అధ్యక్షుల జాబితాని విడుదల చేసింది. పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉన్న ప్రతాప్ కేసరి దేవ్ ఈ వివరాలు ప్రకటించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి కేవలం మనోహర్ రంధారి ఒక్కరే బీజేడీ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మల్కన్‌గిరి: జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున మంగళవారం మా అమ్మ గౌరవం–మన గర్వం అనే నినాదంతో భారీ ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత 9 నెలల్లో 20 వేల మంది మహిళలు, చిన్నారులు, యువతులపై లైంగిక దాడులు జరిగాయన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోవింద పాత్రో, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లోకి పులువురి చేరిక


కాంగ్రెస్‌లోకి చేరిన బీజేడీ నాయకులు, కార్యకర్తలు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ఆధ్వర్యంలో మంగళవారం బీజేడీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిసంకటక్ ఐబీ ప్రాంగణంలో జరిగిన ఈ చేరికల్లో శివపదర్ పంచాయతీకి చెందిన గోపాల కృష్ణ మాఝి, రాజు క్రడక, రాజారావు పాలకియ, రవీంద్ర మహానందియా, మున్నా జకసిక, దీప జకసిక, సుశాంత్ మాఝి, మహేంద్ర మాఝి తదితర ప్రముఖులు కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు పలువురు బీజేడీ కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

బాక్సింగ్ పోటీల్లో చరణ్‌కు కాంస్యం


చరణ్‌తో కోచ్ పురుషోత్తం

శ్రీకాకుళం న్యూకాలనీ: యూత్ బాక్సింగ్ పోటీల్లో సిక్కోలు కుర్రాడు ఎ.చరణ్‌కుమార్ సత్తాచాటాడు. విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 14 తేదీల్లో జరిగిన 7వ ఏపీ రాష్ట్రస్థాయి యూత్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో లైట్ మిడిల్ వెయిట్ విభాగంలో కాంస్య పతకంతో మెరిశాడు. శ్రీకాకుళంలోని మాస్టర్స్ మైండ్స్ వారియర్స్(ఎంఎండబ్ల్యూ) బాక్సింగ్ క్లబ్‌కు చెందిన ఈ కుర్రాడు కోచ్ కె.పురుషోత్తంరావు పర్యవేక్షణలో ఇటీవల అనేక బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించాడు. తాజాగా కాంస్య పతకం సాధించడం పట్ల బాక్సింగ్‌క్లబ్ అధ్యక్షుడు టి.తారకనాథ్, కార్యదర్శి బి.సురేష్‌కుమార్, కోచ్ పురుషోత్తం, క్లబ్ ప్రతినిధులు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

సన్నధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిందే


పోలాకిలోని ఓ రైస్‌మిల్లులో తనిఖీలు చేపడుతున్న సీఎస్‌డీటీ రామకృష్ణ

పోలాకి: 'చిన్నబోయిన సన్నాలు' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో పలు మిల్లుల్లో సన్నధాన్యం, బియ్యం, నూకలు తదితర స్టాకులను తనిఖీ చేశారు. వాటా, నిల్వ తదితర అంశాలను తెలియజేసే ఏ, బి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కచ్చితంగా ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా వ్యవసాయశాఖ అధికారులకు సైతం క్షేత్రస్థాయిలో వార్తకు సంబంధించిన అంశంపై ఉన్నతాధికారులు వివరణ కోరినట్లు తెలిసింది. కాగా, రబీకి అందివచ్చిన సన్నధాన్యం ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయడానికి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు లేవని అధికారులు తెలిపారు. ఏదిఏమైనా ప్రభుత్వం ఎగుమతులకు అనుమతిస్తే తప్ప ధాన్యం కొనుగోలులో అనుకున్న స్థాయి మార్కెట్‌ధర పలకదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


కొరాపుట్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వి.కీర్తివాసన్


కొరాపుట్: నబరంగ్‌పూర్ దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ మిహిర్ పండా

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ప్రజా సమస్యల పరిష్కార శిబిరాలైన గ్రీవెన్స్ సెల్‌ను అధికారులు నిర్వహించారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి కేంద్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో గ్రీవెన్స్ నిర్వహించారు. 45 ఫిర్యాదులు రాగా.. వీటిలో 37 వ్యక్తిగతం, 8 సామూహిక ఫిర్యాదులు ఉన్నాయి. వీటిని పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నలుగురు దివ్యాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మిహిర్ పండా పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కేంద్రంలో జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ గ్రివెన్స్ నిర్వహించి ప్రజాసమస్యలను పరిష్కరించారు.

గుడారిలో..

రాయగడ: జిల్లాలోని గుడారిలో జిల్లా యంత్రాంగం మంగళవారం వినతులు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్, ఎస్పీ స్వాతి, ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అజయ్ కుమార్ పాడి తదితరులు పాల్గొన్నారు. గుడారి సమితి పరిధిలో గల వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 16 వ్యక్తిగత సమస్యలు, ఒకటి గ్రామ సమస్యగా గుర్తించారు. జిల్లా అదనపు కలెక్టర్ నాయక్ పాల్గొన్నారు.

మత్తిలి సమితిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ గ్రీవెన్స్ నిర్వహించారు. మత్తిలి సమితిలో పలు పంచాయతీలకు చెందిన వారు తమ సమస్యలను కలెక్టర్‌కు అందజేశారు. 28 వినతులను స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ తాపాస్ నారాయణ్ రోతో, జిల్లా సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, మత్తిలి సమితి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

అబార్‌సింగిలో..

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ అబార్‌సింగి గ్రామ పంచాయతీ భవనంలో మంగళవారం గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ బిజయకుమార్ దాస్ విచ్చేశారు. జిల్లా ఎస్పీ జితేంద్రనాథ్ పండా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం శంకర్ కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో వినతులు స్వీకరించారు. మొత్తం 48 వినతులు అందాయి. ఆర్.ఉదయగిరి సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శోబోరో, బీడీఓ లారీమాన్ ఖర్సల్, తహసీల్దార్ జ్యోతిర్మయ దాస్, జిల్లా జనస్వాస్థ్య అధికారి, తదితరులు పాల్గొన్నారు.


రాయగడ: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ


మల్కన్‌గిరి: సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్


పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక జమాల్ లైన్ శ్రీరామ మందిరంలో చేపట్టిన శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఉదయం పూర్ణాహుతి హోమం చేపట్టారు. అలాగే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోరపల్లి నాగరాజు, కార్యదర్శి సానా జగదీష్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శేఖరరావు, సహాయ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కోశాధికారి వారణాసి రమేష్, సభ్యులు బి.వెంకట రమణ, కళింగ వైశ్య కుల పెద్ద వారణాసి సత్యనారాయణ, వారణాసి శివప్రసాద్, ఎస్.ఈశ్వరరావు, ఎ.తిరుమలరావు, ఎస్.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి అగ్నిమాపక దళం చైతన్య ర్యాలీ



పర్లాకిమిడి పట్టణంలో అగ్నిమాపక దళం శకటం ద్వారా ప్రచారం


పర్లాకిమిడి: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు స్థానికులు స్పందించి అగ్నిమాపక దళానికి ఫోన్ చేయాలని అగ్నిమాపక దళం అధికారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా పట్టణంలో పలు గ్రామాలలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బెత్తగుడ అగ్నిమాపక దళం స్టేషన్ నుంచి పర్లాకిమిడి, రాణిపేట, కోర్సండ గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నారు. ఈనెల 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


శ్రీనివాసరావు మృతదేహం

ఆమదాలవలస/బూర్జ: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలో వెంగళరావు కాలనీ సమీపంలో అప్‌లైన్ ట్రాక్‌పై మంగళవారం రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం పాలవలస గ్రామానికి చెందిన సురవరపు శ్రీనివాసరావు(42) టాటా ఏస్ వ్యాన్ నడుపుతుంటాడు. ప్రతిరోజూ పాలకొండ నుంచి శ్రీకాకుళం కర్రపాట్లు తరలిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావుకు భార్య భవాని, కుమార్తె స్పందన, కుమారుడు చైతన్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు


విద్యార్థులు, ఆర్ట్ టీచర్‌కు షీల్డ్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు బంగారు పతాకాలు, మరో పది మంది విద్యార్థులు వెండి పతకాలు సాధించారు. విజయవాడలో ఈ నెల 5న డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 12వ ఆల్ ఇండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ర్వహించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు కంచిలి గురుకుల విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను పంపించారు. వాటిలో ఎంపిక కావడంతో మంగళవారం ప్రపంచ ఆర్ట్ దినోత్సవం సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేశారు. ప్రతిభ కనబర్చిన మరో 80 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. గురుకుల కళాశాల ఆర్ట్స్ ఉపాధ్యాయుడు దిక్కల మన్మథరావుకు జాతీయ బాల ఉత్తమ చిత్రకళ అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పైల గణపతిరావు, డి.మల్లికార్జునరావు, సూపరిండెంట్ గేదెల జయరాం తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం


తీవ్ర గాయాలతో చిన్నలచ్చయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం ఫ్లై ఓవర్ వంతెన కింద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. విజయనగరం జిల్లా రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగడ చిన్నలచ్చయ్య (74) బస్సులో ప్రయాణిస్తూ చిలకపాలెం వద్ద దిగాడు. లావేరు మండలం బుడుమూరు సంతకు వెళ్లే క్రమంలో ఫ్లై ఓవర్‌ను దాటుతుండగా.. చిలకపాలెం వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో వృద్ధుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీడీఆర్‌సీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ)లో ఇద్దరు సభ్యుల ఖాళీల భర్తీకి భారత ప్రభుత్వ వినియోగదారుల శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు రఘుపాత్రుని చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు జడ్జి/పదేళ్ల అనుభవం గల జిల్లా జడ్జి/జిల్లా అదనపు జడ్జి/వ్యాపార న్యాయ ఆర్థిక అకౌంటింగ్ తదితర రంగాలలో 25 ఏళ్ల పైబడి అనుభవము కలిగిన 50 ఏళ్ల పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- అత్తవారే కారణమంటున్న మృతురాలి బంధువులు
- భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు


భవాని (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ భవానీ(21) అనే వివాహిత మంగళవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలఖండ్యాం గ్రామానికి చెందిన భవానీకి సంతవురిటి గ్రామానికి చెందిన దినేష్‌తో తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. దినేష్ సచివాలయ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్నాళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పాలఖండ్యాంలోని పుట్టింటికి వెళ్లిన భవానీ ఈ నెల 14న సంతవురిటి వచ్చింది. అదే రోజు రాత్రి మళ్లీ దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున 4 గంటల సమయంలో భవానీ సోదరుడు నాగరాజుకు దినేష్ ఫోన్ చేసి భవానీ మృతిచెందినట్లు సమాచారం అందించాడు. సోదరుడు వెళ్లి చూసేసరికి భవానీ విగతజీవిగా కనిపించింది. భవానీ మృతికి అల్లుడు దినేష్, అత్తింటి వారే కారణమని బంధువులు ఆరోపించారు. భవానీ మెడపై గాయాలు ఉండటంతో దినేష్ హత్య చేశాడని ఆరోపిస్తూ మృతురాలి తండ్రి ధారబోయిన రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జె.ఆర్.పురం సీఐ అవతారం, ఇన్‌చార్జి ఎస్‌ఐ లక్ష్మణరావు, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా పూర్తి చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త దినేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

తండ్రీకుమార్తెలపై దాడి


దాడిలో గాయపడిన పిట్ట పాపారావు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర పంచాయతీ గొదలాం గ్రామంలో తండ్రీకుమార్తెలపై దాడి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ట పాపారావు ఆరో తరగతి చదువుతున్న తన కుమార్తె లక్ష్మిప్రియతో కలిసి స్కూటీపై బోరుభద్రలో ఉన్న వివేకానంద పాఠశాలకు బయలుదేరారు. మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన పిట్ట ముఖలింగం ఇనుప రాడ్డుతో వెనుక నుంచి దాడి చేయడంతో పాపారావుతో పాటు కుమార్తె కింద పడిపోయారు. కిందపడిన తండ్రీకుమార్తెలపై ముఖలింగంతో పాటు పిట్ట లక్ష్మణరావు, రామారావులు కర్రలతో దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకొని బాధితులకు సపర్యలు చేసి 108 అంబులెన్సులో కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిగత, ఆస్తి తగదా వల్లే దాడి జరిగిందని సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

రసవత్తరంగా కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్ష పదవి


రబినందో-ఇందిరా నందో దంపతులు


ఈశ్వర్ చంద్ర పాణీ గ్రాహీ

జిన్ను హిక్కా

కొరాపుట్: ప్రతి పక్ష బీజేడి పార్టీకి కొరాపుట్ జిల్లా అధ్యక్ష పదవి కోసం రసవత్తర పోరు జరుగుతోంది. పార్టీ అధిష్టానం ఇప్పటికే ఈ పదవి కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో సగం జిల్లాలకు అధ్యక్ష స్థానాల ఎంపిక పూర్తయ్యింది. ఏ జిల్లాలోనూ ఈ పదవి కోసం సీనియర్ నాయకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పూర్తి బలంతో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో జిల్లా అధ్యక్షుల ఎంపిక కష్టమవుతోంది.

కొరాపుట్ జిల్లాలో విభిన్నం

కొరాపుట్ జిల్లాలో ఈ పదవికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అందుకు కారణం మాజీ మంత్రి రబినారాయణ నందో ఆసక్తి చూపడమే. ఆర్థికంగా బలంగా ఉన్న నందో దంపతులు అనూహ్యంగా ఈ పదవి పై ఆసక్తి చూపారు. దాంతో అందరి దృష్టి ఈ పదవి పై పడింది. గత నాలుగు నెలలుగా నందో దంపతులు తమదైన శైలి లో లాబీలు చేస్తున్నారు. తాము ఓడిపోయినా పార్టీని నమ్ముకొని దశాబ్ద కాలంగా పని చేస్తున్నామన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో రబినందోకి టికెట్ కేటాయించకుండా అతని సతీమణి ఇందిరా నందోకి టిక్కెట్ ఇచ్చి భారీ మూల్యం పార్టీ చెల్లించింది. దాంతో నందో కుటుంబం పై అధిష్టానం పెద్దలకు దృష్టి పడింది. తనకు పదవి ఇస్తే ఈ నాలుగేళ్లు జిల్లా వ్యాప్తంగా పార్టీ కోసం తిరిగి పని చేస్తానని రబినందో తేల్చి చెబుతున్నారు.

కిం కర్తవ్యం..

అవిభక్త కొరాపుట్ జిల్లాలో గత దశాబ్దకాలంగా కీలకమైన నేతగా ఈశ్వర్ చంద్ర పాణిగ్రహీ కొనసాగుతున్నారు. పార్టీ అధికారంలో లేకపోయినా ఈశ్వర్ కి పదవికి ఢోకా లేదు. ప్రస్తుతం అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఆర్థికంగా శక్తి వంతమైన కొరాపుట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. అందువల్ల నాలుగు జిల్లాలు తరచూ పర్యటిస్తున్నారు. దాంతో పార్టీ జిల్లా అధ్యక్ష పదవి పై ఆసక్తి చూపడం లేదు. కానీ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఇష్టం లేక పోయినా అధ్యక్ష పదవి స్వీకరించాల్సి ఉంటుంది.

బద్ధ శత్రుత్వం

రబినందో దంపతులు, ఈశ్వర్ పాణిగ్రహీలు ఒకే కమ్యూనిటీకి చెందినప్పటికీ బద్ధ వైరం ఉంది. ఈ వైరం గత 27 ఏళ్లుగా కొనసాగుతోంది. రబినందో మంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 15 ఏళ్ల పాటు ఈశ్వర్‌ను పార్టీలో అనేక ఇబ్బందులకు గురి చేశారని చెబుతున్నారు. గత 11 ఏళ్లుగా ఈశ్వర్ హవా కొనసాగుతున్న సమయం లో నందో కుటుంబంకి రాజకీయ వేధింపులు జరిగాయని అంటున్నారు. వీరిద్దరి అంతర్గంత పోరుతో అధిష్టానం కూడా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడింది.

మధ్యే మార్గం

అధికారంలో ఉన్నప్పుడు అధిష్టానం ఆదేశాలు అందరికి శిరోధార్యం. కానీ ప్రస్తుతం పార్టీ ప్రతి పక్షంలో ఉంది. రబి నందో కి పదవి ఇస్తే ఈశ్వర్ వర్గంకి కోపం వస్తుంది. ఇవ్వక పోతే నందో దంపతుల నిర్ణయం ఎలా ఉంటుందో ఎవ్వరూ ఊహించలేక పోతున్నారు. దాంతో అధిష్టానం ఏ నిర్ణయం చేయలేక మధ్యే మార్గం గా మాజీ ఎంపీ జిన్ను హిక్క ని అధ్యక్షునిగా చేస్తారని సంకేతాలు వస్తున్నాయి. గతంలో జిన్ను అధ్యక్ష పదవిలో కొనసాగారు. అందువల్ల మళ్లీ జిన్నునే కొనసాగిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

సంతకవిటి ఎస్సైపై దాడి

- 1.50తులం బంగారు చైన్ చోరీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో ఇటీవల జరిగిన పగడాలమ్మ తల్లి జాతర బందోబస్తులో ఉన్న ఎస్సైపై దాడి చేసి 1.50 తులం చైన్ చోరీ చేసినట్లు ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి 1:30 గంటలకు డ్యూటీలో మాబ్‌ను కంట్రోల్ చేస్తున్న సందర్భంలో ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వెనుక నుంచి ఎస్సైపై దాడి చేసి చేసి చైన్ లాక్కుని వెళ్లిపోయినట్లు బాధిత ఎస్సై ఆర్.గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వాసుదేవరావు మంగళవారం తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


వెంకటరమణ (ఫైల్)

కొమరాడ: మండలంలోని అర్తాం-సోమినాయుడువలస రైల్వే గేటు మధ్యలో రైలు ఢీకొని యువకుడు కొప్పర వెంకటరమణ(26) మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటరమణ అర్తాం సమీపంలోని తన పొలానికి వెళ్తున్న క్రమంలో రైల్వేట్రాక్ దాటుతుండగా ప్రమాదం జరిగి మృతిచెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి..


రమణ మృతదేహం

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన మారడబూడి రమణ (52) ఆటో బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై బి.దేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మారడబూడి రమణతో పాటు మరికొందరు కలిసి గ్రామానికి చెందిన ఆటోలో సోమవారం పూసపాటిరేగ మండలం గోవిందపురంలో బంధువుల ఇంటికి వెళ్లి అదే ఆటోలో తిరిగి వస్తుండగా బల్లంకి గ్రామ సమీపంలో గుమ్మడి బందవద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణ తల వెనుక భాగంలో గాయం కాగా అక్కడికక్కడే చనిపోయాడని, మిగిలిన వారంతా గాయాల పాలైనట్లు మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడు రమణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

20 నాటుకోళ్ల మృతి


మెట్ట మగ్గూరులో మృతిచెందిన నాటుకోళ్లు

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణంలో మార్పు వచ్చి గంటన్నర పాటు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. వంగర, ఎం.సీతారాంపురం, మద్దువలస, మగ్గూరు, సంగాం, ఓనెఅగ్రహారం తదితర గ్రామాల్లో వర్షం కురవగా . మెట్టమగ్గూరు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పూడుకుపోవడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి గ్రామానికి చెందిన పక్కి గంగమ్మ, సంగాపు పకీరు, సంగాపు జగన్నాథంలకు చెందిన 20 నాటుకోళ్లు మృతిచెందినట్లు బాధితులు వెల్లడించారు. అలాగే మద్దువలస డ్రైనేజీలు పూడుకుపోవడంతో వర్షం నీరు ఇళ్ల ముందు చేరగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

టిప్పర్ దగ్ధం


దగ్ధమైన టిప్పర్

పాచిపెంట: మండలంలోని కేరంగి పంచాయతీ నందేడువలస సమీపంలో మంగళవారం విద్యుత్‌వైర్లు తాకి ఓ టిప్పర్ దగ్ధమైంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పూడి నుంచి నందేడువలస నూతన రహదారి నిర్మాణానికి టిప్పర్‌లో మెటల్ రాయి తీసుకువెళ్లి నందేడువలస సమీపంలో ఒంపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు టిప్పర్‌కు విద్యుత్ వైర్లు తాకి మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్‌లు దూకేయడంతో ప్రాణపాయం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసే సమయానికి టిప్పర్ పూర్తిగా దగ్ధమైపోయింది.విద్యుత్ వైర్లు రోడ్డు పక్కన తక్కువ ఎత్తులో ఉన్నాయని పలుమార్లు మండల, జిల్లా సర్వసభ్య సమావేశాల్లో అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని జెడ్పీవైస్ చైర్మన్, సర్పంచ్, ఎంపీటీసీ విలేకరులకు తెలిపారు.

బంకుల్లో అన్నీ బొంకులే..!

- పెట్రోల్ బంకుల్లో కానరాని సౌకర్యాలు
- జిల్లావ్యాప్తంగా 44 చోట్ల ఏర్పాటు
- అందుబాటులో లేని మరుగుదొడ్లు, ప్రథమ చికిత్సకిట్లు, తాగునీరు
- ఆపద సమయాల్లో లేని ఫోన్ సౌకర్యం, నాణ్యత తనిఖీ పరికరాలు, ఫిర్యాదుల పెట్టె
- మరమ్మతుల బారిన గాలియంత్రాలు



పార్వతీపురం-విశాఖపట్నం రాష్ట్రీయ రహదారి పరిధిలో వెంకంపేట పంచాయతీ విద్యానగర్‌లో ఉన్న పెట్రోల్ బంకులో నిరుపయోగంగా ఉన్న గాలినింపే యంత్రం


విద్యానగర్‌లో ఉన్న పెట్రోల్ బంకులో తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో యాజమాన్యాలు ఇష్టానుసారం వ్యవహరిస్తూ వినియోగదారులకు అందించాల్సిన సేవలను అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తమను ఎవరూ ప్రశ్నించరనే భావనతో వారు వ్యవహరిస్తున్న తీరు కానరాని సౌకర్యాల పట్ల తేటతెల్లమవుతోంది. బంకుల్లో నిబంధనల మేరకు ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలు దాదాపు ఏ బంకులోనూ కానరావడం లేదు. వాటిని విధిగా పౌరసరఫరాలు, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ మొక్కుబడిగా ఒకటి రెండు బంకులను తనిఖీ చేసి మమ అనిపించేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ట్యాక్స్‌లను వసూలు చేస్తున్న యాజ మాన్యాలు సౌకర్యాలు కల్పించడంలో తాత్సారం వహిస్తున్నాయి. వినియోగదారులకు అందాల్సిన సేవలు అందకపోవడంతో యాజమాన్యాలు ట్యాక్స్ లను అప్పనంగా వసూలు చేసి వినియోగదారులకు సేవలు దూరం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో హెచ్‌పీ, బీహెచ్‌పీఎల్, ఇండియన్ ఆయిల్, నయారా సంస్థలకు సంబంధించి 44 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వాటిని ఆయా ప్రాంతాల్లోని యాజమాన్యాలు నిర్వహిస్తున్నాయి.

ఈ సౌకర్యాలు ఉండాలి

స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రథమ చికిత్స కిట్లు, ఉచితంగా గాలినింపే యంత్రాలు, ఆపద వేళ సమాచారం ఇచ్చేందుకు ఫోన్, నాణ్యత తనిఖీ చేసే బ్లాటింగ్ పేపర్లు, ఫిర్యాదుల పెట్టె తదితరమైన సౌకర్యాలు పెట్రోల్ బంకుల్లో ఉండాలి.


బైపాస్ రోడ్డులో కల్యాణ మంటపం పక్కన ఉన్న బంకులో మూలకు చేరిన తాగునీటి ఫిల్టర్, గాలి నింపే యంత్రం

అలంకరణకే..

పెట్రోల్ బంకుల్లో ఎక్కడ చూసినా గాలినింపే యంత్రాలు మరమ్మతుల బారిన పడి నిరుపయోగంగా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని బంకుల్లో తాగునీరు సౌకర్యం ఏర్పాటు కానరావడం లేదు. పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనదారులు టైర్లలో గాలి నింపమని సిబ్బందిని అడిగితే పనిచేయడం లేదని బదులిస్తున్నారు.

మరుగుదొడ్లకు తాళాలు

బంకుల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు తాళం వేసి అందుబాటులో లేకుండా చేస్తున్నారు. కేవలం సిబ్బంది మాత్రమే ఉపయోగించుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల కనీస స్థాయిలో మూత్రశాలలు పరిశుభ్రత లేకుండా అధ్వానంగా, అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

కానరాని ప్రథమ చికిత్స కిట్లు

ప్రథమ చికిత్స కిట్లు ఏ చోట కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. కొన్ని చోట్ల పెట్టెమాత్రమే ఉండి లోపల ఔషధాలు, ప్రథమ చికిత్స పరికరాలు కనిపించడం లేదు. అలాగే వినియోగదారులకు ఫిర్యాదుల పెట్టె, నాణ్యత తనిఖీకి కావాల్సిన పరికరాలు అత్యవసర సమయాల్లో సమాచారం ఇచ్చేందుకు ఫోన్ సౌకర్యం వంటివి కనిపించడం లేదు.

మా దృష్టికి వస్తే సమస్య పరిష్కారం

బంకుల్లో అందాల్సిన సేవలపై కానీ యాజమాన్యం వినియోగదారుల పట్ల వ్యవహరిస్తున్న శైలిపై కానీ ఫిర్యాదులు వస్తే సంబంధిత బంకు యాజమాన్యంపై చర్యలు చేపడతాం. పార్వతీపురం మన్యం జిల్లాకు సివిల్ సప్‌లైస్ జీఎంగా కొద్దిరోజుల క్రితం బాధ్యతలు స్వీకరించాను. సిబ్బందితో సమన్వయం చేసుకుని బంకుల్లో నిర్వహిస్తున్న కార్యకలాపాలపై తనిఖీ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఐ.రాజేశ్వరి, జీఎం సివిల్ సప్‌లైస్, పార్వతీపురం మన్యం జిల్లా

ఆర్థిక అవసరాలకు కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

- ఎస్పీ అధ్యక్షతన వార్షిక సమావేశం
- రుణాలపై వడ్డీ శాతం 6 నుంచి 4.08కి తగ్గింపు
- మ్యారేజ్ రుణాలు లక్ష నుంచి రెండు లక్షలకు పెంపు
- పర్సనల్ లోన్ పరిమితి 75 వేల నుంచీ లక్షకు పెంపు


డీపీఓలో ఎస్పీ అధ్యక్షతన జరిగిన హోం గార్డ్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వార్షిక సమావేశం

విజయనగరం క్రైమ్: హోం గార్డ్స్ ఆర్థిక అవసరాల నిమిత్తం తీసుకోవాల్సిన నిర్ణయాలను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వార్షిక సమావేశంలో ఎస్పీ వకుల్ జిందల్ అధ్యక్షతన మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా హోం గార్డ్స్ వ్యక్తిగత రుణాలను పెంచాలని ఎస్పీ వకుల్ జిందల్ నిర్ణయం తీసుకున్నారు. అలాగే హోం గార్డ్స్ పిల్లల వివాహాలకు రుణాల మంజూరుకు క్రెడిట్ సొసైటీ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా తీసుకున్న రుణాలపై వడ్డీ రేటును కూడా తగ్గించాలని సొసైటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోం గార్డ్స్ అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని, వారి ఆర్థిక అవసరాల కోసం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పనిచేస్తుందని చెప్పారు. కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో హోం గార్డ్స్ వ్యక్తిగత రుణాలను ప్రస్తుతం ఉన్న రూ.75 వేల నుంచి రూ.లక్షకు పెంచామని తెలిపారు. ఇక హోం గార్డ్స్ వారి పిల్లల వివాహాలకు ప్రస్తుతం తీసుకుంటున్న రుణాలను రూ.రెండు లక్షలకు పెంచామన్నారు. తీసుకుంటున్న రుణాలపై వడ్డీశాతం కూడా తగ్గించామని తెలిపారు. సొసైటీని మరింతగా వృద్ధిలోకి తీసుకువచ్చి ప్రగతి పథం వైపు నడిపించేందుకు సభ్యుల నుంచి సలహాలను తీసుకుంటామని ఎస్పీ వకుల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇక 2024–2025 వార్షిక సంవత్సరానికి సొసైటీ ఆదాయ, వ్యయాలను తీసుకుంటున్న నిర్ణయాలను సొసైటీ సెక్రటరీ సుశీల సభ్యులకు వివరించారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత,సీఐలు లీలారావు, చౌదరి, ఆర్ఎస్సై గోపాల నాయుడు సంస్థ సెక్రటరీ సుశీల, నీలకంఠం , డైరెక్టర్లు శంకరరావు, గోపాలరావు, రమణ, మహేశ్వరరావు బంగార్రాజులు పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం


జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న

పార్వతీపురంటౌన్: సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షల ఆన్‌లైన్ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి ఇ.అప్పన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీఈటీ ఉత్తీర్ణులై, సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు అర్హులైన స్థానికులైన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనకబడిన తరగతుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిగ్రీ మార్క్స్ లిస్ట్, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు టీఈటీ మార్క్స్ లిస్ట్ జిరాక్స్, పాస్ పోర్ట్ ఫొటోలు 2 దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఆర్‌సీఎం స్కూల్, రూం నంబర్ 8, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పార్వతీపురం కార్యాలయంలో పని వేళల్లో సమర్పించాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో కల్యాణి ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించిన రేణుక కల్యాణిని అభినందిస్తున్న కోచ్ గంగాధర్

చీపురుపల్లి: పవర్‌లిఫ్టింగ్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన సాకేటి రేణుక కల్యాణి ఉత్తమ ప్రతిభ కనపరిచింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రేణుక కల్యాణి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. దీంతో కోచ్ గంగాధర్ ఆమెను అభినందించారు. ఈ నెల 11 నుంచి 13 వరకు కృష్ణా జిల్లాలోని గుడివాడలో గల ఎన్‌టీఆర్ ఇండోర్ స్టేడియంలో 12వ ఏపీ స్టేట్ కాస్లిక్ పవర్ లిఫ్టింగ్, బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 84 ప్లస్ కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీల విభాగంలో పాల్గొన్న రేణుక కల్యాణి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. అలాగే బ్రెంచ్ ప్రెస్ విభాగంలో రజత పతకం సాధించింది.

మే 12న పైడితల్లి దేవర మహోత్సవం

- మే 13 నుంచి ఉయ్యాలకంబాల వరకూ చదురుగుడిలోనే అమ్మ దర్శనం
- ఉత్సవ వివరాలు వెల్లడించిన ఈఓ ప్రసాద్


పైడితల్లి దేవర ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకువచ్చే దేవర మహోత్సవాన్ని వచ్చేనెల 12న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. చదురుగుడి వెనుక ఉన్న కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఉత్సవ వివరాలను వెల్లడించారు. 12వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న అమ్మవారి చదురువద్దకు తీసుకెళ్లి పూజలు చేస్తామని తెలిపారు. అనంతరం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారిని హుకుంపేట నుంచి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొచ్చి మంగళవారం వేకువజామున మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడిలో ఆశీనులు చేస్తారన్నారు. అప్పటి నుంచి ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు చదురుగుడిలోనే కొలువై భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవానికి సంబంధించి ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజుతో మే 5న సాయంత్రం అమ్మవారికి మనవిచెప్పి చాటింపు వేయిస్తామన్నారు. అనంతరం ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సూపర్ వైజర్ ఏడుకొండలు, తలయారీ చినపైడిరాజు, రమేష్ పట్నాయక్, మణికంత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల క్లోరినేషన్ జరగాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా విస్తృత చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వివిధ పత్రికల్లో తాగునీటి సమస్యపై వచ్చిన వార్తలపై కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా అధికారులు స్పష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి పథకాలకు మెట్లు లేకపోతే తక్షణం మెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు వెంటనే పనులు చేపట్టాలని కోరారు. జిల్లా పరిషత్ నిధులు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, వీరఘట్టం, సీతంపేట తదితర మండలాల నుంచి తాగునీటి సమస్యపై వచ్చిన అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాలను అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు.

రూ. 50 లక్షలతో ప్రతిపాదనలు

శ్రీకాకుళం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నుంచి అందిన రూ.50 లక్షల ప్రతిపాదనల మంజూరుకు త్వరలో చర్యలు చేపడతామన్నారు. సీతంపేట మండలం మెట్టుగూడ వద్ద తాగునీటిపై వచ్చిన వార్తలకు తక్షణ స్పందించి బీకేజీని పునరుద్ధరించామని గ్రామీణ నీటి సరఫరా డీఈ తెలిపారు. సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య ప్రస్తుతానికి లేదని, ఎప్పటికప్పుడు వాటిపై దృష్టి సారించి చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ నెట్‌వర్క్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా పంచాయతీ అధికారి టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు

శ్రీకాకుళం రూరల్: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి బొల్లినేని మెడిస్కిల్స్‌లో జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కు బీఎస్సీ డిప్లమా పారామెడికల్ నర్సింగ్ బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు.

పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- పరిశ్రమ నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు పాదయాత్ర
- పోస్టర్లు విడుదల చేసిన సీఐటీయూ నాయకులు


పరిశ్రమ ఎదుట పాదయాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ, యూనియన్ నాయకులు

చీపురుపల్లి: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని కర్లాం శ్రీ వెంకటరామా పౌల్ట్రీ పరిశ్రమలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. గడిచిన 40 రోజులుగా కార్మికులు నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా బుధవారం పౌల్ట్రీ పరిశ్రమ నుంచి చీపురుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వరకు నిర్వహించ తలపెట్టిన సామూహిక పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను పరిశ్రమ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌల్ట్రీ పరిశ్రమలో అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్ ఆదేశాలు కూడా ఉన్నాయని అయినప్పటికీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. అంతేకాకుండా పరిశ్రమలో స్థానికులకే 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున కార్మికులను తీసుకొచ్చి నియమించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అందులో భాగంగానే బుధవారం ఉదయం పరిశ్రమ నుంచి కార్మికులంతా ఒక్కటై పాదయాత్రగా బయల్దేరి చీపురుపల్లిలోని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కార్యాలయం వరకు పాదయాత్రగా నిరసన తెలుపుతూ వెళ్లనున్నట్లు తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన ఈ పాదయాత్రకు ప్రజలు, ప్రజాప్రతినిధులు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులతో బాటు యూనియన్ నాయకులు టీవీ.రమణ, ఎ.గౌరునాయుడు, ఐ.గురునాయుడు, టి.ఈశ్వరరావు, సూరిబాబు, గొల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, చిత్రంలో క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగకు చెందిన పత్తిగిల్లి దిలీప్‌కుమార్ సిటీ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న గాయత్రి మెటల్ మార్ట్ షాప్‌లో 240 కిలోల రాగి,160 కిలోల ఇత్తడి, మూడు ఇన్వర్టర్ బ్యాటరీలతో పాటు 60 వేల నగదు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితుడు వన్‌టౌన్ స్టేషన్‌లో మార్చి 30వ తేదీన ఫిర్యాదు చేయగా వెంటనే స్టేషన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో పెందుర్తి మండలం చినముషిడివాడ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పేంద్ర నాయుడు, పేంద్ర సుదర్శన్ బాబు, ఏసు, కృష్ణ అనే నలుగురు చోరీకి పాల్పడినట్లు తేలింది. పక్కా సమాచారం మేరకు పేంద్ర నాయుడు, పేంద్ర సుదర్శన్ బాబులను అరెస్ట్ చేసి, ముప్పై వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

ద్విచక్రవాహన చోదకుడిని ఢీకొన్న బస్సు


ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీబస్సు

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం వద్ద మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ద్విచక్రవాహనదారుడిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాల మేరకు శ్రీకాకుళం జిల్లా అమదలవలసకు చెందిన ఇప్పిలి సత్యనారాయణ విజయనగరం జిల్లా రేగిడి మండలంలో గల చక్కెర కార్మాగారంలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో పాలకొండ నుంచి విశాఖ వెళ్తున్న ఓఎంఎస్ సర్వీసు బస్సు గోపాలపురం వద్ద ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారుడు గాయాలపాలు కాగా వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించడంతో ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఈ ఘటనపై ఎస్సై కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..


చెల్లాచెదురైన ద్విచక్రవాహనాలు, విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కార్పియో

పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం స్కార్పియో వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో మూడు ద్విచక్రవాహనాలు చెల్లాచెదురు కాగా ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీనిపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా రేగిడిఆమదాలవలస మండలం వండానపేటకు చెందిన కొమ్మోజు గణపతిరావు తన ద్విచక్రవాహనంపై వీరఘట్టం వెళ్తుండగా అదే మండలంలోని చిన్నయ్యపేటకు చెందిన సవిరిగాన సింహాచలం స్కార్పియో వాహనం నడుపుతూ వీరఘట్టం వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో వర్షం కురుస్తుండడంతో ద్విచక్రవాహనదారు ఉన్నట్లుండి తన వాహనాన్ని కుడివైపు మళ్లించే యత్నం చేశాడు. దీంతో ఆ బైక్‌ను తప్పించబోయిన స్కారియో వాహన చోదకుడు కూడా పూర్తిగా కుడివైపు తన వాహనం తిప్పడంతో ద్విచక్రవాహదారుడిని వెనక నుంచి బలంగా తాకుతూ అక్కడి వైన్‌షాపు ముందు నిలిపి ఉన్న మరో రెండు బైక్‌లను, ముందున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారు గణపతిరావు గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై ఎస్సై కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురంటౌన్: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించడానికి, వివాదాలను ముందుదశలోనే పరిష్కరించడానికి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి మే 10వ తేదీన మొదటి జాతీయ లోక్‌అదాలత్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నామన్నారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడానికి లోక్‌అదాలత్ వారధిగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగేకన్నా కేసులను సామరస్యంగా పరిష్కరించుకుని రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమన్నారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందని పేర్కొన్నారు.